
కథ

కలియుగం... ప్రథమపాదం... జంబూద్వీపం... భరతఖండం... ఆంధ్రదేశం... 2001వ సంవత్సరం (క్రీ.శ)... జూలైనెల... పదమూడోతారీఖు... శుక్రవారం... ఉదయం అయిదున్నర ఆరుగంటమధ్య... ముగ్గురు వేర్వేరు వ్యక్తులు శ్రీ వెంకటేశ్వరుణ్ని ఈవిధంగా ప్రార్థించారు.

"స్వామీ! నా భర్తని మార్చు. నీ మహిమ తెలియజేయి. నువ్వున్నావని నిరూపించు. నీ కొండకొచ్చి నూరు కొబ్బరికాయలు కొడతాను" అంటూ సరస్వతి--నాభార్య.

"వెంకన్నబాబూ! నా ఉద్యోగం ఆర్డరు ఇవ్వాళ్లేనా సంతకం అయ్యేట్టు చూడు. ఆ సూపర్నెంట్ మనసు కరిగేట్టు చూడు. నువ్వున్నావని నిరూపించు" అంటూ వెంకటరమణ, చనిపోయిన వాళ్లనాన్న ఉద్యోగం తనకొస్తుందన్న ఆశతో ఉన్న నిరుద్యోగి.




# ద్వైతాద్వైతం

డా॥ యస్.కె.సుధాకర్

"స్వామీ! సడన్‌గా పడిపోతున్న నా ప్రాక్టీస్‌ని పైకినెట్టు. నేను నీకొండపైకి వచ్చేస్తాను. మొక్కు తీర్చుకుంటాను. నీ ఉనికిని నిరూపించుకో స్వామీ!" డా॥ సత్యమూర్తి యమ్మెస్, శ్రీ వెంకటేశ్వరా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టరు, ఓనరూను.

సుప్రభాతం నేపథ్యంలో దేవుడు ఆ ముగ్గురి మొరని విన్నాడు(?!)

విని... తన ఉనికిని నిరూపించుకోవడానికి నన్నెన్నుకున్నాడు....

అనుకోకుండా....

అనుకోకుండా ఈ కథకి నేను హీరోనయ్యేను.

ఫలితంగా

000

ఆరోజు రాత్రి తొమ్మిదిన్నరకి 'శ్రీలక్ష్మి వెంకటేశ్వర బార్ అండ్ రెస్టారెంట్'లో నుండి... నా నుండి ఆర్డర్స్ పొందాల్సిన వెంకటరమణ బిల్లు పే చేయగా... ఓ మాదిరిగా ఎక్కువగానే, తాగి బయటికొచ్చి స్కూటర్ మీద ఇంటికొస్తూ లారీని ఢీ కొట్టేను. (మా వాళ్లందరి మాటల ప్రకారం లారీ నన్ను గుద్దేసింది)

"పాపం చచ్చిపోయాడ్రా!" అంటున్నారెవరో.

ప్రక్కకి పడిపోయిన నా స్కూటర్ తాళంచెవికి తగిలించిన కీచైనులోంచి వెంకటేశ్వరస్వామి నవ్వుతూ చూస్తుండగా... నాకు స్పృహ తప్పింది.

000

నాకు స్పృహ వచ్చేసరికి స్వర్గంలాంటి గదిలో సగం వ్రేలాడగట్టబడి ఉన్నాను. నా కుడికాలు పూర్తిగానూ, కుడిచెయ్యి పాక్షికంగానూ నలిగిపోయి, విరిగిపోయాయి.

కొంచెం స్పృహ... బోలెడంత కోమా.

అలా పడుకునే హాస్పటల్ గోడల వంక చూశాను. చలవరాతితో కట్టారు. బహుశా నేనింకో పాతికేళ్లు సర్వీసు చేశాక కూడా అలాంటి బిల్డింగ్ కట్టలేనేమో. ప్రస్తుతం పాఠశాలల్లో విద్య, సినిమాల్లో కథా లేనట్టే ఇక్కడా వైద్యం తప్ప అన్నీ ఉన్నాయి. నర్సు ఎయిర్‌హోస్టెస్‌లాగుంది. ఫోన్, కలర్ టి.వి, సోఫాలు, నా వంటికి కట్లూ, ప్రక్కన సైలేన్ స్టాండూ, సీసా లేకపోయుంటే... అది నేనూ, మా ఆవిడ హనీమూన్‌కొచ్చిన హోటల్ గదిలా ఉంది.

పెళ్లిళ్లలో పెళ్లికళ లోపించినట్టూ, చావులప్పుడు ప్రేతకళ లేనట్టూ ఇక్కడ ఈ హాస్పటల్‌లో ఉండాల్సిన

విషాదచ్ఛాయలేం కనబడ్డంలేదు.

అలాగని ఆనందంగా ఉందా అంటే... అదీ లేదు.

"వెంకన్నబాబు కరుణించి ప్రాణం పోలేదు. అంతేచాలు" ఎవరో అంటున్నారు. వెక్కిళ్ల మధ్య మా ఆవిడ మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. ఇంతలో మురళి వచ్చాడు. మురళి నా ఏకైక తమ్ముడు 'డాక్టర్లేమం టున్నారు' అన్నాడు నన్ను చూస్తూనే (వాడు 'అన్నయ్యకెలా ఉందీ' అనడిగితే బావుండుననిపించింది నాకు).

సమాధానంగా మా ఆవిడ 'మూడ్రోజుల దాకా టైమిచ్చారు. గడిస్తేగానీ చెప్పలేరట. ఇదిగో ఇంతక్రితమే కళ్లు తెరిచిచూశారు' అంది. మరో అరగంటపాటు (బహుశా) ఇబ్బందిగానే కూర్చుని 'ఇక వెళ్తా వదినా! ఆఫీసులో ఆడిట్ ఉంది.... అవసరానికిది ఉంచు అంటూ కొంత డబ్బిచ్చి లేచాడు. వెళ్తూవెళ్తూ ఆగి 'వదినా! అన్నయ్య నీతో ఏమైనా చెప్పాడా?' అనడిగాడు.... అది దేనిగురించో నాకు తెలుసు... వాడికీ తెలుసు... మాఆవిడకీ తెలుసు. వాడికి తెలుసునన్న సంగతి మా ఆవిడకి తెలుసునన్న సంగతీ... నాకు తెలుసు.

వాడికీ నాకూ ఆస్తిపంపకం అన్నీ సజావుగానే జరిగిపోయినా... రీసెంట్‌గా అమ్మిన అరవైసెంట్ల భూమి తాలూకు డబ్బు మొత్తం నాదగ్గరే ఉండిపోయింది. ఈలోగానే నేను చచ్చిపోతే ఎలాగన్న భయం వాడినలా అడిగించింది.

క్లుప్తంగా 'లేదు' అంది మా ఆవిడ.

వాడు వెళ్లిపోయాడు.

ఎవరెవరో వస్తున్నారు. నా ప్రశాంతతను పాడుచేస్తూ. కాని ఇంత గొడవలోనూ నాకు స్పష్టంగా విన్పిస్తోన్న మాటొక్కటే... వచ్చిన వాళ్లంతా 'దేముడు దయచూపబట్టి' అంటూ ఏదో చెప్తున్నారు. నాకెందుకో నవ్వొస్తోంది.... నానవ్వుకి సమాధానంగా దేవుడే ప్రత్యక్షమైతే! అన్న ఆలోచన. అనుకున్నదే తడవుగా... దేవుడు ప్రత్యక్షమయ్యాడు.

"ఏమిటి స్వామీ ఇదంతా! నీ లీలేనా!" అనడిగాను.

చిర్నవ్వు నవ్వాడు.

"అదికాదు స్వామీ! నేనేమో తాగొస్తున్నాను. తప్పునాది. ఈదేశపు ట్రాఫిక్ రూలు ప్రకారం రోడ్డుకి ఎడమప్రక్కగా వెళ్లాల్సిన నేను రోడ్డుమధ్యలో వస్తూ లారీని ఢీకొట్టాను. పడ్డాను. ఇంత తప్పు నాదే కదా. ఇందులో నీ ప్రమేయమెక్కడుంది?"

మళ్లీ నవ్వే సమాధానం. అదే నన్నుడికించింది.

"ఒకవేళ నువ్వే గనుక నన్ను రక్షించదలచుకుంటే... అంత పెద్ద యాక్సిడెంట్‌లయ్యాక కూడా, నేనూ, నా స్కూటర్ ఏ విధమైన గాయాల పాలవ్వకుండా బ్రతికిపోవాలి అంతేకదా! అంతేగాని, ఇంత పెద్ద దెబ్బలతో ఇలా అయితే, నువ్వుండబట్టే నీ కరుణ ప్రసరించబట్టే నేను ఇంకా కనీసం ఇలాగైనా ఉన్నానా? అది నిజమా! సర్వాంతర్యామివి నా ఏక్సిడెంట్ అసలు జరక్కుండా ఆపాలిగానీ....

ఇంకో ముఖ్యమైన ప్రశ్న.... అసలు నువ్వు ఉన్నావా? అంతా మాయేనా?

చిరునవ్వూ.... రూపమూ రెండు ఒకేసారి మాయమైపోయాయి.

"అమ్మా! నాన్న కలవరిస్తున్నాడేవ్!" అంది చంటిది. నా కూతురు.

నాకు కొద్దిగా స్పృహ వచ్చింది.

మాటకూడా వచ్చింది.

మా డాక్టర్‌కి ధైర్యం వచ్చింది.

ఫీజు పిండగలనన్న నమ్మకమొచ్చింది.

'భగవంతుడి దయుంటే బ్రతుకుతాడు లేకపోతే లేదు' అన్న డాక్టర్ ఉన్నట్టుండి ఇదంతా నా గొప్పతనమే అంటూన్నాడిప్పుడు.

ఫీజు ఎంతవుతుందన్నారని ఎవరో అడిగితే మా ఆవిడ చెప్తోంది.... దాదాపు నలభైవేలవుతుందని. నాకు మళ్లీ నవ్వు... నామీద నాకే జాలి కలిగాయి.

ఎందుకంటే... వెంకటరమణ దగ్గర నుండి, అతడికి పోస్టింగ్ ఆర్డర్స్ ఇప్పించడం కోసం నేను తీసుకున్న లంచం.... నలభైవేలే మరి....

## "తాగేసి వచ్చి తలుపు కొట్టాడు ఆ దర్శకుడు!"

\- హీరోయిన్ ఆరోపణ



సినిమారంగంలో నటీమణులు ఎన్నో రకాల ఇబ్బందులకు గురవుతారని ముంబయికి చెందిన సోనాలీజోషి చెబుతున్నది. సోనాలి 'సుబ్బు' చిత్రం హీరోయిన్. న్యూజిలాండులో ఆ చిత్రం తాలూకు షూటింగులకని వెళ్లినప్పుడు దర్శకుడు సురేశ్‌వర్మ తనను చాలా బాధలు పెట్టారని సోనాలి ఆరోపించింది. "అర్ధరాత్రి బాగా తాగేసి వచ్చి నా గది తలుపులు బాదారు. నేను తలుపు తీయగానే లోపలికి ప్రవేశించనీయమని కోరారు. దానికి నేను అంగీకరించకపోవటంతో తిరిగివెళ్లారు. ఆ చిత్రం పూర్తి చేద్దామనే ఉద్దేశంతో అక్కడుండవలసివచ్చింది. ఉన్నన్ని రోజులూ నాకేమి ఇబ్బంది కలుగుతుందోనని దినదినగండంగా బతకవలసివచ్చింది. ఇక్కడ కెరీర్ నిర్మించుకుందామని వస్తే ఇట్లాంటి గొడవ జరిగి నా ఆశలన్నిటినీ నిరాశలయ్యాయి. నేనిక తెలుగు చిత్రాల్లో అస్సలు నటించను! నాకు రెండు లక్షలిస్తామని చెప్పి 81 వేలను ఇంకా ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. వాళ్లడిగిన వాటికి అంగీకరించి వుంటే ఇంకా ఎక్కువే ఇచ్చేవారేమో! ఈ విషయాన్ని బహిరంగపరచటంలో నా ఉద్దేశం, నా తరువాత రంగంలోకి కొత్తగా వచ్చేవారికి ఇదో ముందు జాగ్రత్తగా వుంటుందనే" అంటూ ప్రెస్ మీట్‌లో సోనాలి వాపోయింది.

దీనికి సమాధానం చెబుతూ నిర్మాత మహేశ్, "మేమెవరమూ సోనాలిని ఎటువంటి బాధలూ పెట్టలేదు. ఆమెకు తగినంత పారితోషికం ఇచ్చినా కూడా తాను అదనంగా చేసిన ఐదు రోజులకూ రెండు లక్షల రూపాయలు డిమాండ్ చేసింది. ముందుగానే ఆమె పారితోషికమంతా చెల్లించేసినా, మరో యాభై వేలిచ్చాం.కొత్త నటైనా చాలా గర్వం సోనాలికి. తనప్పుడే స్టారైపోయినట్లుగా ఫీలవుతున్నట్లుంది. మా తప్పేమీ లేదు. అనవసరంగా మా మీద ఆరోపణలు చేస్తూంది" అన్నారు.

కానీ నిప్పు లేనిదే పొగ రానే రాదని అందరికీ తెలిసిన విషయం. ఇది ఇట్లాగే సాగితే ముంబయి నుంచి వచ్చే హీరోయిన్లు రాకుండా పోతారా? ఏమో!

ఎన్.

దానికీ, దీనికీ సరి.

000

మధ్యాహ్నానికి మా బావమరుదులొచ్చారు, ముగ్గురు. పరామర్శల తర్వాత యాక్సిడెంటెలా అయిందో వాకబు చేశారు. మా చిన్నబావ గొంతు వినిపించింది... "ఏక్సిడెంట్ సమయంలో బావ తాగి ఉన్నట్టు చెప్పొద్దు.... లారీవాళ్లు డబ్బివ్వరు... ఇన్సూరెన్స్ కూడా రాదు. దానికోసం పోలీసుల్నీ డాక్టర్నీ నేను 'మేనేజ్' చేస్తాలే. అక్కా! నువ్వుకూడాఈ విషయం ఎక్కడా అనొద్దు... 'దేవుడి దయవల్ల' ఆ డబ్బొస్తే... ఇక నాకు వినిపించడం పూర్తిగా మానేసింది. ఆడాల్సిన అబద్ధాలన్నీ ఆడి... లౌక్యంగా వాళ్లదగ్గర డబ్బు గుంజేసి... చివర్లో 'దేవుడి దయేంటో' నాకర్థం కాలేదు. ఆ తరువాతొచ్చిన సందర్భం... నా ఇన్సూరెన్స్ పాలసీల గురించీ ఉన్న అప్పుల గురించీను. నా ప్రస్తుత పరిస్థితిలో నేను చేసిన మంచిపనేమైనా ఉంటే అది అయిదులక్షలకి ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవడం. ఇక నా అప్పుల గురించి సరస్వతికి తెలీదు. అదే తను వాళ్లన్నయ్యలకి చెప్పింది.

"ఫరవాలేదులే! ఇన్సూరెన్స్ వాళ్లను కూడా మేనేజ్ చేద్దాం! ప్రాబ్లం లేదు" అన్నాడు మా చిన్నబావమరిది.

చివరిగా నన్ను కదిలించిన అంశం....

నా అంత్యక్రియల గురించి... రేపుదయంలోగా పోతే... ఏఏ కార్యక్రమాలు ఎక్కడెక్కడ తొం... ద... ర... గా జరిపించాలో మా బావమరదులు నిర్ణయించసాగారు. మా ఆవిడ వెక్కిళ్ల నేపథ్యంలో.

నిజం చెప్పొద్దు.... అది విషాదంలా లేదు నాకు వినోదంగా ఉంది.

"ఇప్పటిదాకా దేవుడి దయ గురించీ మాట్లాడుకున్నవాళ్లు... అదే దేవుడి దయ అలానే 'కంటిన్యూ' అవుతుందని నేను బ్రతికే తీరుతానని కనీసం కోరుకోనైనా కోరుకోవడం లేదు ఏమిటా అని?"

నా ప్రాణం పోవాలని నేనే కోరుకున్న సంఘటన ఆ సాయంత్రం జరిగింది.

000

"ఇప్పటికెంతయింది ఖర్చు" రాగానే మా మామగారు మా చినమామగార్ని అడిగారు.

"నలభై అవుతోంది."

"ఇంకా ఎంతవుతుందట?"

"చెప్పలేం ప్రైవేటు హాస్పిటల్ కదా! ఎక్కువే అవుతుంది." ఇదంతా ఆయనికి తెలీక కాదు. కానీ ఓ మంచి ఆర్గ్యుమెంట్ క్రియేట్ చేయడం కోసం రీజనింగ్‌లు వెదుకుతున్నాడంతే... ఆయన ఓ పేరున్న వ్యాపారవేత్త మరి.

మా పెద్దనాన్నకొడుకు అక్కడే ఉన్నాడు.

"ఇక ఎంతకాలం ఇలా కనిపెట్టి చూడాలో"నని అన్నాడు.

"అందుకే 'దేవుడిదేయ' ఇంతేనని అనుకొని ఈరాత్రిలోగా తెరిపినయ్యకపోతే, తెలివి రాకపోతే... ట్రీట్‌మెంట్.... ఆపేద్దాం."

"బహుశా నా అంతరాత్మలోనూ ఇదే ఫీలింగ్ ఉండివుంటుంది... ఉన్న డబ్బంతా పోతే రేపటి భవిష్యత్తేంటీ" అన్నవాదన. నిజం కూడా అదే. హుందాగానూ, నాగరికంగానూ, మా చినమామగారిద్వారా మా మామగారే అలా చెప్పించినా ఆశ్చర్యం లేదు.

అయితే నన్ను కలవరపెడ్తోంది అదికాదు... 'దీనింతటికీ దేవుడిదయ అన్న క్లాజు ఎందుకు తగిలించబడ్తోందీ' అని.

నా సంశయానికి సమాధానంగా దేవుడు ప్రత్యక్షమయ్యేడు... అదే చిద్విలాసం.

"స్వామీ! ఏమిటిదంతా! నువ్వెక్కడెక్కడ మా మనుషులందరికీ ఉపయోగపడుతున్నావో చూశావా? ఈ నాటకానికి ఇంక తెరదించు స్వామీ! నాకు మరణం అనుగ్రహించు" అన్నాను ప్రశాంతంగా.

నీలామానుష విగ్రహం... నవ్వుతో నావైపు చూస్తూ,

"నీ ఆయుస్సు ఇంకా తీరలేదు నాయనా! నువ్వింకా ఈ లోకంలో ఉంటావ్!" అంటూ అదృశ్యమయ్యేడు.

ఆ క్షణమే నేను బ్రతికేశాను.

"అమ్మా! నాన్నగారు కళ్లు పూర్తిగా తెరిచి చూస్తున్నారే" అంటోంది చంటిది... ఆనందంగా.

000

మా ఆవిడ వెంకటేశ్వరుడికి మళ్లీ మొక్కింది.

వెంకటరమణ డ్యూటీలో జాయిన్ అయి పోయాడు. దేవుడికి మొక్కు తీర్చుకునేందుకు వెళ్లాడు.

నేను అంత అర్జంటుగా బ్రతికిన వైనానికి డాక్టరుకి ఆశ్చర్యం కలిగింది. అప్పుడు చనిపోయే స్థితిలో ఉన్న నన్ను చూసి డబ్బు ఆశ పుట్టింది. ఇప్పుడు బ్రతికాక పబ్లిసిటీ ఆశ పుట్టింది... ఇదంతా మా హాస్పటల్ ఘనతే అనడం ప్రారంభించాడు.

గోడమీద దేవుడి కేలండర్ గాలికే ఊగిందో దేవుడే నవ్వాడో.

మొత్తానికి నావైపు చూశాడు కొంటెగా.

000


నాకు స్పృహ వచ్చిన వెంటనే నన్ను పరామర్శించారు...నన్ను ఢీకొట్టిన లారీతాలుకూ వాళ్లు. బంగారం వెంకటేశ్వరుడి ఉంగరం సగం వేలిని ఆక్రమించుకుంది. మిగతా వేళ్లు బంగారపు ఉంగరాల మయమై మిలమిల లాడుతున్నాయ్. సెంటువాసన హాస్పటల్ వాసనతో కలసి వింత పరిమళంగా మారుతోంది.

నా మీదకి వంగి, "ఎంత ఖర్చైనా ఫరవాలేదు... మేం భరిస్తాం. పోలీసు కేసేం లేకుండా చూడండి అంతే చాలు" అన్నాడు భరోసాగా. లారీడ్రైవర్ ఆ ఓనరుగారి అన్ అఫీషియల్ బామ్మర్దిట మరి.

నవ్వుతో ఆయనవంక చూసి....

మీరేం కంగారు పడొద్దు. తప్పంతా నాది. మీ లారీవాళ్లది కాదు. ఏక్సిడెంట్ టైంలో తాగివస్తూ లారీని నేనే ఢీకొట్టాను. మీవాడేమైనా తప్పుచేసుంటే... అది స్పీడుని కంట్రోల్ చేసుకోలేకపోడవడమే. కావాలంటే ఈ విషయాలన్ని అలానే రాసిస్తాను. నేనిప్పుడు పూర్తిగా మంచి మానసికస్థితిలోనే ఉన్నాను. మీమీద పోలీసు కేసు ప్రసక్తే లేదు" అన్నాను ప్రశాంతంగా.

మా ఆవిడ లేదు. అరటిపళ్లు



తీసుకురావడానికెళ్లింది.

ఆ లారీ ఓనరు ఆనందంగా నావైపు చూసి మా పాపచేతిలో ఎంతో డబ్బు పెట్టేసి వెళ్లిపోయాడు.

వెళ్లిపోతూ... "దేవుడి దయవల్ల గొడవలేకపోతే అంతే చాలు, అంతకంటే కావాల్సిందేముంది" అన్నాడు.

000

ఆ మర్నాడు సాయంత్రం వచ్చాడు నా తమ్ముడు.

"రారా!" అన్నాను. వచ్చి కూర్చోగానే వాడితో నేరుగా విషయం కదిలించి పొలం అమ్మిన సొమ్ము గురించి వివరించసాగేను. వాడు మతిపోయిందా అన్నట్టు నావైపు చూసి...

"అదంతా ఇప్పుడెందుకన్నయ్యా! దేవుడిదయవల్ల నువ్వు బ్రతికేవు అంతే చాలు. తర్వాత మనం విషయాలు మాట్లాడుకోవచ్చులే. మా వదిన మాంగల్యం గట్టిది" అంటూ ఇంకా ఏవేవో చెప్పి వెళ్లిపోయాడు.

మా బావమరుదులైతే...దేవుడి కృప గురించి తెగ మాట్లాడుతున్నారు. వాళ్లందర్నీ పిలిచి పాలసీలు, అప్పులు మొదలు...నా అంత్యక్రియల విశేషాలదాకా చర్చిద్దాం సరదాగా...కూర్చోండన్నాను.

"భలేవాడివే బావా! నువ్వు బ్రతికావుగా అవన్నీ ఇప్పుడెందుకూ! దేవుడి దయ ఉంది చాలదూ!" అన్నారు తేలిగ్గా.

000

వెంకటరమణ అన్నపేరు పెట్టుకున్న కుర్రాడు ఉద్యోగం ఆర్డరుకోసం (అది న్యాయబద్ధంగా అతడికి రావాల్సిన ఉద్యోగమని తెల్సినా, కూడా) నలభైవేలు లంచం ఇచ్చాడు. ఉద్యోగం వచ్చినందుకు ఆనందంగా దేవుడికి మొక్కాడు.

"లక్ష్మీవెంకటేశ్వరా బార్ అండ్ రెస్టారెంట్" ఓనరు దేవుడి పేరుని సారాకొట్టుకి పెట్టుకుని లక్షలకి లక్షలు ఆర్జిస్తున్నాడు.... అంతా దేవుడి దయుంటున్నాడు.

'వెంకటేశ్వరా నర్సింగ్ హోం' అంటూ తన హాస్పటల్‌కి దేవుడి పేరుపెట్టి రోగులనుండి గూండాలా డబ్బులు గుంజుతున్నాడు డాక్టరు.

అన్నీ 'దేవుడి' ద్వారానో... దేవుణ్ని అడ్డం పెట్టుకొనో చేయబడుతున్నాయ్.

మరి దేవుడేం చేస్తున్నట్టు!

దేవదేవా! నిజం చెప్పు! నువ్వు అసలున్నావా!?!?

000

మర్నాడుదయం నన్ను ఆసుపత్రి నుండి ఇంటికి తెచ్చారు. మూడురోజులు గడిచాయి.

తెల్లారి అయిదవుతోంది.

తూర్పు ఎర్రబడుతోంది.

ఊదారంగులోంచి ముదురు ఎరుపురంగులోకి మారుతోంది ఆకాశం.

అక్కడక్కడా చిక్కని మబ్బుపింజెలు.

కిటికీలోంచి ఆ దృశ్యం స్పష్టాస్పష్టంగా కనిపిస్తోంది.

ఓ కొంగలబారు మెల్లిగా ఆకాశంలోంచి ఎగురుతోంది.

నా భార్య నిండా తలస్నానం చేసి... ముడి బిగించి, నిండుగా చీర చుట్టబెట్టుకొని తులసికోట చుట్టూ ప్రదక్షిణాలు చేస్తోంది. నా ఏక్సిడెంట్ తర్వాత పూజ చేసుకునేంత సమయం దొరకడం బహుశా ఇదే ననుకుంటా... అదీకాక ఇక నా ఆరోగ్యానికి ఢోకాలేదని చెప్పారు.

మాఆవిడ పూజ పూర్తి అయ్యింది.

లోని కొస్తోంది.

ఆ భావంగానే ఆమెవేపు చూశాను.

ఆమె మొహంలో... కాంతి ఉంది. నిండుదనముంది. నిర్మలత్వం పరిమళిస్తోంది. ఇవన్నింటికంటే ముఖ్యంగా... ఆమెలో కనిపిస్తోంది... ప్రశాంతత.

పరిపూర్ణ ప్రశాంతత.

ఖచ్చితంగా అది పూజవల్ల వచ్చిందే.

దేవుడి అవసరం మనిషికెందుకో నాకిప్పుడర్థమైంది.

నుదుట సింధూరం, కనుబొమ్మల నడుమ చిన్నిబొట్టు, తలస్నానం చేశాక, వెన్నెల్లో గోదారి అలల్లా ఊగుతోన్నకురులు, ప్రశాంతత నిండిన కన్నులు, మానసిక ధైర్యం...

తన క్షేమాన్ని తన ఆరోగ్యాన్ని ఆ దైవమే అనుక్షణం ఓ కంట కనిపెడుతున్నాడన్న ఫీలింగ్... యస్స్... ఫీలింగ్... అనుభూతి.... అదికదూ కావాల్సింది మనిషికి.

కొద్దిమంది ఇతర మతాలవాళ్లనీ మినహాయిస్తే.... అసలు ఎంతమంది ప్రతిరోజూ ఎవరో ఓ అతిథికి భోజనం పెట్టాకే తాము భోజనం చేస్తున్నారు??

లౌక్యం.... అబద్ధం... బ్రతకడానికి పడే హింస.... పెట్టే హింస...

నరకమంటే ఎక్కడో ఉండదు.

దెయ్యాలూ,... కింకరులూ కూడా అంతే.... ఎక్కడో లేరు.

మరి దేవుడు?


ఈ విషయాలన్నీ పూర్తిగా అర్థమయ్యేక....

నేను పూర్తిగా బ్రతికేను.

000

మా ఆవిడ నాదగ్గరికొచ్చింది. నానుదుట్న బొట్టు పెట్టింది. చిన్నగా మనోహరంగా నవ్వింది. ఆప్యాయంగా... అమ్మలా స్పృశించింది... దైవత్వం నిండి కళ్లతో మీకేం కాదు అన్న సందేశాన్నందించింది. చూశారా దేవుడున్నాడు అంది మాంగల్యం కళ్లకద్దుకుని.

అప్పుడు చూశాను.... తన మెళ్లో ఉండాల్సిన బంగారంతాడు బదులు పసుపుతాడు వేల్లాడుతోంది. ఆ విషయమే అడిగితే చెప్పింది. ఏక్సిడెంట్ టైం నేను తాగి బండి నడుపుతున్నట్టు రాస్తే 'కంపెన్సేషన్' సొమ్మూరాదని, అందుకే రిపోర్టు జాగ్రత్తగా రాయడం కోసం... డాక్టర్నీ, పోలీస్‌నీ మేనేజ్ చేయడం తప్పదనీ, దానికోసం డబ్బు సర్దుబాటుకాక, ఆమె తమ్ముడికి ఆ తాడు ఇచ్చి అది అమ్మించివేసిందనీ... సో... ఇప్పుడు మా బావమరిది ఆ గొలుసు అమ్మగా వచ్చిన డబ్బుతో 'మేనేజ్' చేస్తున్నాడనీను.




000

ఇప్పుడుగానీ దేవుడు ప్రత్యక్షమైతే నేనడిగే ప్రశ్న ఒక్కటే

"దేవదేవా! నిజం చెప్పు! అసలు మనిషి నిన్నెందుకు సృష్టించాడూ!" అని.

■